నిజామాబాద్‌లో ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ ఇబ్రమ్, ఎస్బీఐ ఆర్‌ఎం శ్రీకాంత్, 'నమస్తే తెలంగాణ' ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్ ఎన్ సురేందర్‌రావు.. ప్రాపర్టీ షోకు తరలివచ్చిన ప్రజలు

నిజామాబాద్‌లో నమస్తే ప్రాపర్టీ షో

జడ్పీ చైర్మన్ విఠల్‌రావు చేతుల మీదుగా ప్రారంభం • ఒకే వేదికపైకి పలువురు బిల్డర్లు, రియల్టర్లు • రుణ వసతుల కల్పనకు బ్యాంకర్లు సిద్ధం

ఖలీల్‌వాడి (నిజామాబాద్), మార్చి 22: నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రాపర్టీ షో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన అనేక నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలు ఈ ప్రాపర్టీ షోలో స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాల నిర్మాణ సంస్థలతో పాటు బ్యాంకులు కూడా ఇందులో భాగస్వామ్యమయ్యాయి. పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ఇలాంటి ప్రాపర్టీ షోలు ఉపయోగపడతాయన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని చెప్పారు. రియల్ రంగంలో అనేక కంపెనీలు చేపడుతున్న ప్రాజెక్టులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం మంచి ప్రయత్నమని కితాబునిచ్చారు. ఆటో షో, ప్రాపర్టీ షోలతో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యం చేస్తున్న ప్రయత్నం అద్భుతమని ప్రశంసించారు. నగర వాసులకు ఇలాంటి కార్యక్రమాలతో దూరభారం, వ్యయ భారం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే ప్రదర్శనలకు దీటుగా ఇక్కడ కూడా ప్రాపర్టీ షో జరుగుతుండటం ఆశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు. ప్రాపర్టీ షోలో యూబీఐ రీజినల్ హెడ్ శంకర్ ఇబ్రమ్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎం శ్రీకాంత్, నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ గడ్డి ధర్మరాజు, బ్యూరో చీఫ్ జూపల్లి రమేశ్, ప్రకటనల విభాగం ఏజీఎం మొగుల్ల రాజిరెడ్డి, మేనేజర్ కడారి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు శక్తికి.. నమ్మకానికి నిలువుటద్దం

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే నిర్వహిస్తున్న ప్రాపర్టీ షోలో అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకున్న సంస్థలను మాత్రమే ప్రదర్శనకు అనుమతించాం. ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్టుమెంట్లు, ఫర్నిచర్, సోలార్ తదితరాల సమాచారమంతా ఒకే దగ్గర లభించేలా ఏర్పాట్లు చేశాం. 20 లక్షల విలువైన ఓపెన్ ప్లాట్ల నుంచి 3 కోట్ల విలువైన విల్లాల వరకు ప్రదర్శనలో ఉంచాం. తక్షణమే రుణాలి చ్చేందుకు ఎస్బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉన్నా యి. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడేపై ఉన్న నమ్మకాన్ని గుర్తుచేస్తున్నది.

- ఎన్ సురేందర్‌రావు,
నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం జనరల్ మేనేజర్

లోకం పోకడ



బీజేపీ తరపున రేవంత్ వకాల్తా

- **ఢిల్లీ మద్యం కేసుపై బీజేపీకి బీ-టీమ్ లీడర్‌లా వ్యాఖ్యలు**
- **రేవంత్ కాంగ్రెస్ మనిషి కాదు.. బీజేపీ, మోదీ మనిషి**
- **పాలసీపై మేం చెప్పిందే ఖర్గే, రాహుల్ చెప్పారు: హరీశ్**

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై సీఎం రేవంత్‌రెడ్డి తీరు బీజేపీకి బీ-టీమ్ లీడర్‌లా ఉన్నదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఆయన వ్యవహార శైలి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ తీరుకు వ్యతిరేకంగా ఉన్నదని విమర్శించారు. రేవంత్ తీరు కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రతినిధిగా ఏ కోశాన కనిపించటం లేదని, బీజేపీ, మోదీకి అనుకూలంగా పనిచేస్తున్నట్టు మరోసారి తేటతెల్లమైందని ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. ఆయన ఆరెస్సెస్ భావజాలం ఉన్న బీజేపీ, మోదీ మనిషి అని మొదట్నుంచీ చెప్తున్నామని అన్నారు. తాను కాంగ్రెస్‌లో ఉన్న విషయాన్నీ మర్చిపోయారని ఎద్దేవా చేశారు. మద్యం పాలసీ విషయంలో ఇన్నేండ్లు తాము ఏం చెప్తున్నామో.. ఖర్గే, రాహుల్‌గాంధీ అదే చెప్పారని హరీశ్ తెలిపారు. తమ వాదనను ఏఐసీసీ కూడా బలపరిచిందని, లిక్కర్ స్కామ్ అనేది కల్పితమని స్పష్టంచేశారు. కేంద్రం రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెట్టిస్తుందని మండిపడ్డారు. ఏఐసీసీ మాట్లాడినదానికి విరుద్ధంగా రేవంత్ మాట్లాడుతున్నారని, లిక్కర్ పాలసీలో స్కాం జరిగిందని, నిందితుల అరెస్టు ఆలస్యమైందంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని, బీజేపీ తరపున వకాల్తా పుచ్చుకొని బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు సీఎం అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కక్షసాధింపు ఎంతోకాలం సాగదు

- **కవిత అరెస్ట్ వేధింపుల్లో భాగమే**
- **కడిగిన ముత్యంలా బయటకు వస్తారు**
- **బీఆర్‌ఎస్ పార్లమెంట్ సభ్యుల వెల్లడి**

ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు. చిత్రంలో ఎంపీలు రవిచంద్ర, సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగమే ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అని బీఆర్‌ఎస్ పార్లమెంట్ సభ్యులు ధ్వజమెత్తారు. ఈ క్షకసాధింపు చర్యలు ఎంతోకాలం సాగవని, దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఢిల్లీలో శుక్రవారం బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, రాజ్యసభలో ఉపనేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మన్నె శ్రీనివాస్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. తమను ఎదురించే వారిని రాజకీయాల నుంచే నిర్మూలించటమే దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న విధానమని, తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత అరెస్టు అందులో భాగమేనని నామా నాగేశ్వరరావు చెప్పారు. మహారాష్ట్రలో శివసేన పార్టీని బీజేపీ ఏం చేసిందో దేశం ఇంకా మరచిపోలేదని అన్నారు. ఏ రాష్ట్రానికి సంబంధించిన పాలసీలు ఆ రాష్ట్రానికి అనుగుణంగా ఉంటాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి రాష్ట్ర పునర్నిర్మాణంలో తన వంతు పాత్రపోషిస్తున్న ఎమ్మెల్సీ కవితను ఒక మహిళ అని కూడా చూడకుండా అరెస్ట్ చేశారని, దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను పరిశీలించి రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు.

ఒడిదొడుకులు కొత్తకాదు : సురేశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమం నుంచి ఇప్పటిదాకా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఒడిదొడుకులు కొత్తకాదని రాజ్యసభలో బీఆర్‌ఎస్ పక్ష ఉపనేత కేఆర్ సురేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో తమకు లొంగని వారిని అరెస్ట్ చేసేందుకు పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు తెలంగాణ ఉద్యమం నుంచే అనేక ఒత్తిళ్లు ఎదురైనా వెరవలేదని చెప్పారు. అనేక పార్టీలు అనేక విధాలుగా కేసీఆర్‌ను లొంగదీసుకోవాలని చూసినా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన తీరును గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత అవినీతి పాల్పడ్డారన్నది కేవలం ఆరోపణనేనని స్పష్టంచేశారు. ఆమెకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని తాము ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

కడిగిన ముత్యంలా వస్తారు : రవిచంద్ర

ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తారని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా దెబ్బకొట్టాలనే బీజేపీ వ్యూహంలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపించారు. 2004 నుంచి 2014 వరకు 200 ఈడీ కేసులు ఉంటే, పదేండ్ల బీజేపీ పాలనలో వాటి సంఖ్య 2,954 దాటిందని ఉదహరించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కవితను అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్తారని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

కేంద్రం మూల్యం చెల్లించక తప్పదు: మన్నె శ్రీనివాస్‌రెడ్డి

రాజ్యాంగ సంస్థలను తమ సొంత సంస్థలుగా వాడుకుంటున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించకతప్పదని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలను తమ రిమోట్ కంట్రోల్‌లాగా బీజేపీ వాడుకుంటున్నదని ఆయన ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

మరో ఇద్దరికి బీఆర్‌ఎస్ టికెట్లు

మొదటిపేజీ తరువాయి...

స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. ఇప్పటికే ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, మల్కాజిగిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఖమ్మం నుంచి నామా నాగేశ్వర్‌రావు, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత, కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, వరంగల్ నుంచి కడియం కావ్య, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఖరారు చేసింది. తాజాగా ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పీ వెంకట్రామ్‌రెడ్డి గతంలో సివిల్ సర్వెంట్స్ అధికారులుగా పనిచేసిన వారు కావడం విశేషం.

సివిల్ సర్వెంట్స్ కేరాఫ్ బీఆర్‌ఎస్

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఈ ప్రాంత బిడ్డలుగా వివిధ హోదాల్లో పనిచేసిన ఎంతోమంది ఉద్యమనేత కేసీఆర్‌తో నడిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, తెలంగాణ పునర్నిర్మాణంలో కేసీఆర్‌తో మమేకమై పనిచేశారు. ఉద్యమ కాలంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఏ రామ్‌లక్ష్మణ్, ఏకే గోయల్, రామచంద్రుడు, కేవీ రమణాచారి, మాజీ డీజీపీ పేర్వారం రాములు, మరో సీనియర్ పోలీస్ ఉన్నతాధికారి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి లాంటి ఎంతోమంది కేసీఆర్‌తో భుజం భుజం కలిపి పనిచేశారు. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇటీవలే బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకుముందు మెదక్ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన పీ వెంకట్రామ్‌రెడ్డి కూడా ఐఏఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరగా, ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఇప్పుడు వీరిద్దరికి ఎంపీ టికెట్లు ఇవ్వడం విశేషం.

కాంగ్రెస్‌ను నమ్ముకున్నోళ్లకు అన్యాయం

మొదటిపేజీ తరువాయి...

ఇతర పార్టీల నుంచి వచ్చిచేరిన వారే. చేవెళ్ల టికెట్ దక్కించుకున్న రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి టికెట్ దక్కించుకున్న సునీతామహేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ టికెట్ దక్కించుకున్న దానం నాగేందర్, పెద్దపల్లి టికెట్ దక్కించుకున్న గడ్డం వంశీకృష్ణ ఇతర పార్టీల నుంచి వచ్చినవాళ్లే. మల్లు రవి మాత్రమే పార్టీ సీనియర్ నేత. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ నిరంజన్.. శుక్రవారం ఖర్గేకు లేఖ రాశారు. ప్రజలకు బీఆర్‌ఎస్ పాలన నచ్చకనే కాంగ్రెస్‌కు పట్టం కడితే, మరి అదే పార్టీకి చెందిన వారిని చేర్చుకొని టికెట్లు ఇవ్వటంలో ఆంతర్యం ఏమిటి? అని లేఖలో నిలదీశారు. బయటి నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వటమంటే పార్టీలో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేరని చెప్పకనే చెప్పినట్టు కాదా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ సభలో 'కార్యకర్తలే పార్టీకి ప్రాణం.. వారు ఎన్నో కష్టాలు, కన్నీళ్లు, కేసులు, జైలుశిక్షలను ఎదుర్కొని చేసిన త్యాగాల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ వ్యాఖ్యలను పరోక్షంగా గుర్తుచేసిన నిరంజన్.. కార్యకర్తలను కడుపులో పెట్టి కాపాడుకుంటామంటే ఇదేనా? అని నిలదీశారు. 'జలగం వెంగళరావు హయాంలో సిద్దిపేట నుంచి సామాన్య కార్యకర్త నంది ఎల్లయ్యకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాం. మర్రి చెన్నారెడ్డి హయాంలో సాధారణ ఉద్యోగి మల్లు అనంతరాములు (మల్లు రవి, భట్టి విక్రమార్క సోదరుడు)ను నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా గెలిపించాం. నాడు సాధారణ వ్యక్తులకు టికెట్ ఇస్తే, ఇప్పుడు వలస నేతలకు టికెట్లు ఇచ్చారు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. లేఖ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా వెళ్లింది. అయితే, నిరంజన్ లేఖ రాయటాన్ని మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ ఖండించడం, లేఖ రాయడం తగదని అనడం పార్టీలో విభేదాలను ఎత్తిచూపినట్టయ్యింది. ఇది ఎక్కడికి దారితీస్తుందో వేచిచూడాలి.

హిట్లర్, ఔరంగజేబు కలబోత మోదీ: కూనంనేని

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఒక హిట్లర్, ఒక ముస్సోలిని, ఫాసిజం, నాజీయిజం అన్ని కలబోసిన వ్యక్తి ప్రధాని మోదీ అని, అధికారం కోసం ఏమైనా చేసే ఔరంగజేబు ఆయనలో దాగి ఉన్నాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చి, శాశ్వత నియంతగా మారాలని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి కుర్చీలో కొనసాగేందుకు ఏమైనా చేసేందుకు మోదీ వెనుకాడటం లేదని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో రెండురోజులపాటు జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల ముగింపు సందర్భంగా శుక్రవారం మగ్దూం భవన్‌లో ఆయన పలువురు పార్టీ నేతలతో మీడియాతో మాట్లాడారు. లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని బయట వదిలేసి.. వంద కోట్ల వ్యవహారంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం ద్వారా ప్రధాని మోదీ తన ప్రత్యర్థుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో స్పష్టమవుతున్నదని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే

- **రాజకీయ ప్రత్యర్థులందరినీ బీజేపీ అరెస్టు చేస్తున్నది**
- **అవినీతిపరుల నుంచి బాండ్స్ రూపంలో డబ్బు దండుకున్నది**
- **కేజ్రీవాల్ అరెస్టుపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్**

న్యూఢిల్లీ, మార్చి 22: ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని రాజ్యసభ ఎంపీ, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ విమర్శించారు. కేజ్రీవాల్ అరెస్టుపై శుక్రవారం సిబల్ స్పందిస్తూ.. 'బీజేపీ చేస్తున్నదంతా ప్రజలందరూ ఊహించిందే. ఇది మొదలైనప్పుడే చెప్పా.. జరగాల్సింది ఇంకా చాలా ఉంది అని. ఎవరైతే ఎన్నికల్లో తమకు పోటీ అని భావిస్తారో, ఎవరైతే తమ వ్యతిరేక పార్టీకి నేతృత్వం వహిస్తారో వారిని వీళ్లు అరెస్టు చేస్తారు. కవితను ఎలా వేధించి అరెస్ట్ చేయించారో చూశాం. అంతకుముందు హేమంత్ సోరేన్‌ను అరెస్ట్ చేయించారు. ఇప్పుడు కేజ్రీవాల్‌ను కుట్రపూరితంగా నిర్బంధించారు. మున్ముందు రాఘవ్ చడ్డాను కూడా ఇలాగే టార్గెట్ చేయనున్నారు. నితీశ్‌కుమార్ కూడా మరోసారి వారితో పొత్తులోకి వెళ్లకపోయి ఉంటే అక్కడ ఆయన పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. ఇదే తరహాలో మహారాష్ట్రలో కూడా అనేక మందిపై బీజేపీ అక్రమంగా కేసులు పెట్టింది. దాంతో వారందరూ బీజేపీలో చేరారు. ఇదంతా బీజేపీ ఆడుతున్న రాజకీయ క్రీడ. కోర్టులు దీన్ని అడ్డుకోకపోతే? మౌనంగా ఉంటే? ఈ అరాచకానికి అడ్డుకట్ట ఉండదు. మరింత దారుణ పరిస్థితులు మనం చూడబోతున్నాం. మోదీ సర్కారుకు డిఫాక్టో మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఈడీనే. బీజేపీకి ఈడీ.. నమ్మకమైన



పనోడిలా మారింది. అసలు ఢిల్లీ లిక్కర్ కేసులో ఏముంది? అది జీరో కేసు. ఏమీ లేదు. అంతా డొల్ల. ముందుగా ఒకరిని సాక్షిగా తెచ్చారు. అతడు మొదటి స్టేట్‌మెంట్‌లో నీకేమీ తెలియదని చెప్పాడు. రెండో స్టేట్‌మెంట్‌లో నాకు కొంత మాత్రమే తెలుసని చెప్పాడన్నారు. ఆ తర్వాత మూడోది, నాలుగో స్టేట్‌మెంట్స్ వచ్చాయి. ఐదో స్టేట్‌మెంట్‌లో అదే సాక్షి.. డబ్బులు ఫలానావారికి ఇవ్వనున్నారని కొందరి పేర్లు చెప్పాడంటారు. ఆ తర్వాత అతను అప్రూవర్‌గా మారాడంటారు. అతనికి అందరికంటే ముందు బెయిల్ వస్తుంది. దినేశ్ అరోరా, మాగుంట ఇలాంటి వారంతా ఇలాగే అప్రూవర్స్‌గా మారారు కదా. ఇప్పుడు ఈడీ చెబుతున్న సాక్ష్యాలన్నీ.. ఈ అప్రూవర్లవే కదా. బలమైన ఆధారాలు లేకుండా అప్రూవర్లు చెప్పిన దాన్ని సాక్ష్యంగా పరిగణించబోమని సుప్రీంకోర్టు గతంలో అనేక కేసుల్లో, అనేక సార్లు స్పష్టం చేసింది. ఈ కేసులో కూడా ఎలాంటి ఇతర సాక్ష్యాలు లేవు. దేశప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అనేక అవినీతి కేసుల్లో అరెస్ట్ చేయాల్సిన దోషుల నుంచి మోదీ సర్కారు ముందుగా బాండ్స్ పేరిట డబ్బు తీసుకున్నది. ఇప్పుడు ఆ స్కీం కూడా ఆగిపోయింది. అందులో పైసలు రావట్లేదు. ఇదంతా బీజేపీ ఆడిస్తున్న రాజకీయ నాటకం. దేశ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది'. అని పేర్కొన్నారు.

సీఎం సీపీఆర్వోపై ఈసీకి ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి సీపీఆర్వో అయోధ్యరెడ్డిపై కేంద్ర ఎన్నికల సంఘానికి శుక్రవారం ఫిర్యాదు అందింది. ఆయన ప్రభుత్వ పదవిలో ఉంటూ సోషల్ మీడియాలో రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని అందులో పేర్కొన్నారు. అయోధ్యరెడ్డి తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో తాజాగా చేసిన పోస్ట్‌లను ఆధారాలుగా చూపించారు. అయోధ్యరెడ్డిని ప్రభుత్వం డిసెంబర్ 12న సీపీఆర్వోగా నియమించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ వ్యాఖ్యలు చేయకూడదన్న నిబంధనను ఆయన అతిక్రమించారని పేర్కొన్నారు. పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కోర్టు చరిత్ర సువర్ణాక్షరాలతో రాయబడదేమో!

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తంచేశారు. 'న్యాయస్థానాలు తమ వారసత్వాన్ని గుర్తుంచుకోవడం అవసరం. చరిత్రకారులు ఈ కోర్టు చరిత్రను రాసినప్పుడు.. నేటి ఈ కేసును మాత్రం స్వర్ణాక్షరాలతో లిఖించరు' అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. 'సరే.. చూద్దాం..' అంటూ ప్రతివ్యాఖ్య చేసింది. మద్యం విధానం కేసులో ఈడీ సోదాల పేరుతో వచ్చి అక్రమంగా అరెస్ట్ చేసిందని, సీబీఐ స్పెషల్ కోర్టు తనను కస్టడీకి ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 537 పేజీల పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కవిత తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో కవిత నిందితురాలు కాదని సాక్షాత్తు సుప్రీంకోర్టుకు చెప్పిన ఈడీ ఆమెను ఎలా అరెస్టు చేస్తుందని ప్రశ్నించారు. నిరుడు సెప్టెంబర్‌లో నిందితురాలు కాదని, సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామని చెప్పిన ఈడీ అంతకుముందు ఆగస్టు నెలలో అప్రూవర్లు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం కవితపై కీలక ఆధారాలు ఉన్నాయంటూ అరెస్టు రిపోర్టులో ఎలా పేర్కొంటుందని ప్రశ్నించారు. ఆగస్టులోనే నిందితురాలని తెలిస్తే.. సెప్టెంబర్‌లో నిందితురాలు కాదని చెప్పడంలో ఔచిత్యం ఏమిటని పేర్కొన్నారు. ఈడీ సుప్రీంకోర్టుకు ఇచ్చిన మాటకు కట్టుబడి లేదని అన్నారు. ఒక్కటంటే ఒక్క సాక్ష్యం సంపాదించలేకపోయినా, ఎలాంటి ఆధారాలు లేకపోయినా కవితను అరెస్టు చేసిందని తప్పుపట్టారు. మద్యం కేసులో పిటిషనర్ కవిత నిందితురాలిగా లేరని, ఆ కేసును సిట్‌కు బదిలీ చేయాలని కోరే హక్కు ఆమెకు లేదని ఈడీ సుప్రీంకోర్టుకు చెప్పిందని గుర్తుచేశారు. కేవలం అప్రూవర్ల వాంగ్మూలాలను పట్టుకుని ఈడీ చీకట్లో బాణం వేస్తున్నదని, కవితను అన్యాయంగా అరెస్టు చేసిందని చెప్పారు.

అన్ని కేసుల్లో ఒకేతీరుగా వ్యవహరించాలి

ట్రయల్ కోర్టుకు వెళ్లాలని ఆదేశించడంపై కపిల్ సిబల్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అన్ని కేసుల విషయంలో ఒకే తీరుగా వ్యవహరించాలని కోరారు. కొందరు రాజకీయ నేతలు, ఆర్థిక స్థోమత ఉన్న వారు నేరుగా సుప్రీంకోర్టుకు వస్తే రాజ్యాంగంలోని 32వ అధికరణం కింద విచారణ చేయలేమని ధార్మసనం స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని ఈడీ ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్‌పై మరో రెండు వారాల్లో రిప్లయ్ కౌంటర్ దాఖలు పిటిషనర్‌ను చేయాలంది. తదుపరి విచారణను జూలై నెలకు వాయిదా వేసింది.

అప్రూవర్ల వాంగ్మూలమే ఆధారమా?

కవితకు వ్యతిరేకంగా ఉన్న అన్ని స్టేట్‌మెంట్స్‌ను ఈడీ అప్రూవర్ల నుంచే తీసుకుందని సిబల్ చెప్పారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి వాంగ్మూలం ఆధారంగా కవితను నిందితురాలిగా పేర్కొంటున్నట్టు ఈడీ చెప్తున్నదని, కానీ ఆయనతోపాటు మరొకరి వాంగ్మూలాలను 2023 ఆగస్టులోనే తీసుకుందని గుర్తుచేశారు. అలాంటప్పుడు సెప్టెంబర్ 24న జరిగిన విచారణలో కవిత నిందితురాలు కాదని ఎలా చెప్తుందని ప్రశ్నించారు. ట్రయల్ కోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు చెప్పడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ ట్రయల్ కోర్టుకు వెళితే ఏం జరిగిందో తెలిసిందేనని వ్యాఖ్యానించారు.

బెయిల్‌పై ట్రయల్ కోర్టులో తేల్చుకోండి

ఈ సమయంలో సిబల్ తిరిగి వాదిస్తూ, ఇదే సుప్రీంకోర్టులో గత ఏడాది సెప్టెంబర్ 24న ఈడీ సమర్పించిన వివరాలను పరిశీలించాలని కోరారు. ''పిటిషనర్ కవిత నిందితురాలిగా లేరు. మద్యం కేసును సిట్‌కు బదిలీ చేయాలని కోరే హక్కు పిటిషనర్‌కు లేదు.' అని ఈడీ స్వయంగా ఆ తేదీన సుప్రీంకోర్టుకు చెప్పిందని వివరించారు. ఇప్పుడు ఈడీ పిటిషనర్‌ను ఎలా అరెస్ట్ చేస్తుందని ప్రశ్నించారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి గత ఏడాది జూలై 14న ఇచ్చిన ప్రకటన, గోపీ కుమారం అనే వ్యక్తి అదే ఏడాది ఆగస్ట్ 8న ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ఈడీ చర్యలు ఉన్నాయని వివరించబోతుండగా సుప్రీంకోర్టు అడ్డుకుంది. ఈడీ దేశ అత్యున్నత న్యాయస్థానంలో చెప్పిన దానికి విరుద్ధంగా చేస్తున్నదని సిబల్ చెప్పారు. పిటిషనర్ కవిత నిందితురాలు కాదని అప్పుడు చెప్పిన ఈడీ ఆ తర్వాత ఏ ప్రాతిపదికపై పిటిషనర్‌ను అరెస్టు చేస్తుందని ప్రశ్నించగానే.. సుప్రీంకోర్టు కల్పించుకుని, కేసు మెరిట్స్‌లోకి వెళ్లవద్దని, రాజ్యాంగపరమైన అంశాలపై తాము జూలైలో విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

ఇక్కడ కాకుంటే ఎక్కడ చెప్పుకోవాలి?

కేసులోని కీలక విషయాలు వినలేమంటే ఏం చేయాలి అని సిబల్ ప్రశ్నించారు. ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం– 2002 కింద ఎలా అరెస్టు చేస్తుందని, కేసులో నిందితురాలు కాదని సాక్షాత్తు సుప్రీంకోర్టుకు చెప్పిన తర్వాత అరెస్టు చేయడంలో ఔచిత్యం ఏమిటని మరోసారి అడిగారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన మాటకు భిన్నంగా చేస్తుంటే.. తాము ఇక్కడ కాకుండా ఎక్కడ చెప్పుకోవాలని ప్రశ్నించారు. ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సుప్రీంకోర్టు మళ్లీ బదులిచ్చింది. ఈ దశలో కవిత తరపు మరో సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కల్పించుకొంటూ.. ఏదో చెప్పబోతుండగా.. సుప్రీంకోర్టు గతంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదని గుర్తుచేసింది. కవిత పిటిషన్‌ను ఏ కారణం చెప్పకుండానే ఉపసంహరించుకున్నారని చెప్పింది. ఈడీ అరెస్టు నేపథ్యంలో సమగ్ర వివరాలతో తాజా పిటిషన్ దాఖలు చేసిన కారణంగా గత పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నట్టు చౌదరి వివరించారు. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని చెప్పిన సుప్రీంకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ట్రయల్ కోర్టు సత్వర విచారణ జరిపేలా ఆదేశాలివ్వాలని చౌదరి కోరగా అందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

ఒక్క ఆధారమూ లేదు

విచారణ ప్రారంభం కాగానే కపిల్‌సిబల్ లేచి.. 'ఢిల్లీ మద్యం కేసులో మా వాదనలు వినండి. దయచేసి హైకోర్టుకు వెళ్లండని మళ్లీ చెప్పవద్దు. ఇదే మా అభ్యర్థన. మాకు వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇచ్చినా ఏం పర్వాలేదు. ఇదే కోర్టులో చెప్పిన దానికి విరుద్ధంగా ఈడీ చర్యలున్నాయి. ఏం జరిగిందో వినండి. పిటిషనర్‌కు (కవిత) వ్యతిరేకంగా ఒక్కటంటే ఒక్క ఆధారం లేదు. ఈడీ ఒక్క సాక్ష్యాన్ని కూడా చూపలేదు. ప్రతిదీ అప్రూవర్ ప్రకటనపైనే ఆధారపడి కేసు దర్యాప్తు చేస్తున్నది. చిన్నపాటి సాక్ష్యాధారం కూడా లేదు. అప్రూవర్ ప్రకటనలనే ఈడీ ప్రామాణికంగా చేసుకుంటున్నది. పిటిషనర్‌ను చట్ట వ్యతిరేకంగా అన్యాయంగా అరెస్టు చేసింది' అని వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. పిటిషన్‌లో రాజ్యాంగపరమైన అంశాలను ప్రస్తావించారని, ఇదే తరహాలో విజయ్ మదన్‌లాల్ దాఖలు చేసిన ప్రధాన కేసుతో పిటిషన్‌ను జత చేసి జూలైలో విచారణ చేస్తామని చెప్పింది.